# మడేలయ్య మనస్సు

బాలయ్యకెంతో సంబరంగుంది....ఉషారుగుంది..... భూమ్మీన కాలు నిలుత్తలేదు.... సాలె శెంకరయ్య మాటే ఎంతో సంతోషంగా గుర్రమెక్కినట్టుందంటె, కడుపుల పడ్డ పోద్దాటి కల్లు ఇంకింత ఖుషీనిచ్చింది. లోపల్లోపల తనండ్ల తాను పాటలు పాడుకుంట దవ్వ దవ్వ నడుసుకుంట ఇంటి కచ్చిండు. అకిట్ల కచ్చి–

"బూదమ్మా....ఓ బూదమ్మా... ఇంట్లున్నావె..."అని పెండ్లాన్ని పిలిసి అరుగె క్కతండు బాలయ్య. మొగని పిలుపిని లోపలి కెల్లి అరుగుమీది కచ్చింది బూదమ్మ. ఎప్పుడేదో పోగొట్టుకున్నోనోలె విచారంగుండె పెనిమిటి మొఖంల సంబరాన్ని సూసి నోరు తెర్సింది. బాగ సంబరం గున్నప్పుడు మాత్తురమే తనను పేరుపెట్టి పిలిసే బాలయ్య ఎందుకంత సంతోషం గున్నడో బూదమ్మ కరుతంగాలే. మొగన్నోసారి కిందనుంచి మీదిదాక సూసి–

"పడుసు పిల్లగానోలె నన్ను పేరుపెట్టి పిలువవడితి వేంది? ఏం దొరికింది? బాగ ఖుషీ పడ్తున్నవు...." అంది బూదమ్మ.

"పడుసోన్ని గాకుంటె ముసలోన్నాయే.... ఇంకరువయేండ్లు నిండకపాయె...." నవ్వుకుంటన్నడు బాలయ్య.

మొగని మాటలకు ముక్కుమేనేలుసుకుంది బూదమ్మ.

"నువ్వు ముసలైన వెండుకైతవుగని... అందాజాత్తె లగ్గం జేసుకునెట్టట్టున్నవు గద..." పరాసిక మాడింది బూదమ్మ.

"మా సేసుకంట గని పిల్ల నెవ్వలియ్యాన్నె..." ముసిముసి నవ్విండు.

"మడేలయ్య ఇయ్యాల జోర్‌దార్‌గ రంజుమీదున్నట్టున్నవు... ఎవ్వలన్న కల్లు పోయించిండ్రా ఏంది....?"

"నువ్వట్టి పిసదానివే... నేను కల్లుదాగిన నిజమే కని. బింకెడంత కల్లు దాగినంత మాత్తరాని కింత సంబురఘుంటాదే....? నీవు ఎందుకక్కరకు రాదు పొయ్యిలిరిసి పెడుతనన్నవు సూడు పల్లాకిని.... గాదానికిప్పుడు గిరాకచ్చింది.... ఎల్లుండి సాలె శెంకరయ్య కొడుకు లగ్గం. పల్లాకిని దురుస్తు సేసుంచుమని ఇరవయి రూపాయల సంచకరిచ్చిండు..." సంబురపడుకుంట సాలె శెంకరయ్యిచ్చిన ఇరవై రూపాయలకెల్లి కల్లు దాగంగ మిగిలిన పదిగేడు రూపాయలు సూపెట్టిండు బాలయ్య.... మొగని మాటలకు బూదమ్మ పెద్దగ సంతోషపల్లేదు.

"గిప్పుడు పల్లాకి రెవ్వలు లగ్గం సేసుకుంటుండ్రు....? మల్ల అది పుచ్చుపట్టిందాయె.

పిల్ల పినవడు కూసున్నంకిరుగుతె మన కరుమం పలుగుతది..." అనుమానం వెలిబుచ్చింది బూదమ్మ.

"థట్ నీ యవ్వ... నువ్వేం మనిషివే....! సుబం పలుకురా మంకెన్నంటె పెండ్లి పిల్ల ముండేడ సచ్చిందన్నడట నీ అసోంటి దెశమంతుడు. ముండ బొడ్డిం దీవించుమంటె నా తీరుగ నువ్వుండువన్నదట. .. నీకెరుక తియ లొట్టసీసు... మన పల్లాకిరుగుతాది....! అదిలాబాదుల కెల్లి తెచ్చిన... అచ్చం టేకు కర్రతో జేయించిన.... బందవస్తుగుంది..."

"ఎంత బందవస్తుగున్నా అది మన లగ్గమయిన కొత్తల సేయించిందాయ్.... నలపయేండ్లు కచ్చెనా...? కొద్దిగంత జాగ్రర్తగుండాలని అన్న...."

"గా అనుమానమే మద్దుగని నువ్వు ఊరు తిరిగిరాపో. ఇద్దరం గలసి పల్లాకిని మంచిగ సేద్దాం..." అన్నాడు బాలయ్య.

"ఇగ గీ బువ్వవెట్టే పనికి నేంగూడ కావల్నా... నువ్వే సేసుకో..." అని బట్టలు తీసుకచ్చుటానికి ఊళ్ళకుపోయింది బూదమ్మ.

దూలాలకు కట్టున్న పల్లాకిని మెల్లంగ కిందికి దించిండు బాలయ్య. దాన్నిండ ఏలుమందంతోని దుబ్బ. ... పల్లాకి వంకికట్టెకు కట్టిన బట్ట చీకిపోయింది... కట్టె కక్కడక్కడ పేల్లు లేస్తున్నయి... పెయిమీదున్న పంచెతోని దుమ్ము దులుపుతుండు బాలయ్య. దుమ్ము దులుపుతుంటే పిల్ల పిడిమడు పట్టుకునే కుచ్చూసిపెయింది... దాన్ని తీసి బైటపారేసిండు బాలయ్య... పనాపి మేర సత్తెయ్య దగ్గరికి పొయ్యి కొత్త కుచ్చును కుట్టిచ్చుకచ్చిండు....

బూదమ్మ ఊరుతిరిగచ్చినంక ఇద్దరు గలసి బువ్వతిన్నరు. బూదమ్మ బట్టల ముల్లె తీసుకోని చాకిరేవుకు పెయింది.... పల్లాకిని మంచిగా సేసెదు మెదలుపెట్టిండు బాలయ్య. పల్లాకి మోసుకుంటనే ఇన్రోజులు కడుపునింపుకున్న బాలయ్యకా పల్లాకిని తాకుతుంటే అదోల వుంది. ఎంతో అత్మీయమైన వస్తువును ముట్టుకున్నట్లనిపిస్తుంది. ఆ పల్లాకిల బాలయ్య రకుత ముంది. కడవల కొద్దీ కార్చిన చెముటుంది. నలుపయేండ్లు బతుకుంది. బాలయ్య కండ్లు ముంగటెన్నో జ్ఞాపకాలు కదులుతున్నాయి.

తన పల్లాకిల లగ్గం సేసుకోవుటానికెంత పోటుండే దొక్కప్పుడు? నెల రొన్నెల్ల ముందు తనకు సెప్పెటోల్లు.... ఎన్ని పైసలున్న దొరల, పటేండ్ల లగ్గాలయినా తన పల్లకిల్నే అయ్యేటియి... తన పల్లాకిని లగ్గం జేసుకుంటే పిల్లపాపలతోని సుకంగుంటారన్న నమ్మకముండేది... అందుకోసం తన పల్లకీల కొన్ని నూర్ల లగ్గాలయినయి. తన భుజాలమీన్నే నూర్లకొద్ది పెళ్ళి జంటలను మోసిండు. మూడూళ్ళల్ల జమేనున్న రాంరావ్ దొర కొడుకులగ్గం తన పల్లాకిల్నే అయింది... అయనె కిప్పుడు నల్గురు పిల్లలు. కరణం పంతులు బిడ్డ లగ్గం గూడ తన పల్లాకిల్నే అయింది. అమె యిప్పుడు మొగన్తోని అమెరికాలుంది. పెద్ద షావుకారి కొడుకు లగ్గం గూడ తన పల్లాకిల్నే అయింది. అయ నిప్పుడు పట్నంలో పెద్ద డాకుటరు. తన పల్లాకిల్నే లగ్గం చేసుకున్న పటేలు కొడుకు ఇంజనీరై పట్నం లున్నడు.... ఈల్లనే కాక ఇంకెంతోమందిని మోసి మోసి తన భుజాలు కాయెలు

కాసినయ్. "ఉష్ ఉష్..." అని లయబద్ధంగా అనుకుంటూ తన పల్లాకీ నెత్తుకొని ఎంతురికెటోడు...? సవారెడ్లు కోళ్లాగెలకందకుంట ఉరుకాలె... ఒక్కోసారి సవారెడ్ల గిట్టలు తన కాల్లకు తగిలేటియి... బండి తోల్తున్న పటేండ్లు అరు గట్టెలను ఝళిపించెటోల్లు... తను ఇంకా బాగురికెటోడు... తనతోని పల్లాకి మోసెటోల్లను ఉరుకుమనెటోడు... ఒక్కోసారి ఎంత ఈడుమీదున్న సవారెడ్లకయినా పల్లాకి నందుకునుడు కష్టమయ్యేది. ఎన్నామైడల దూరమయినా తానురికెటోడు... నడుమ నడుమ యజమాన్లు పోయించే కల్లు నీల్లతోని కడుపునింపుకొనేది...ఈ పనితోని తనకు పెద్దగా సంపాదన సాలకున్నా పొట్టకు గడిసేది. అయినా తనకీ పనంటేనే ఇష్టం. ఇంకే పని రాదు కూడా. కొడుకు తన పని సెయ్యనని బొగ్గుబాయి పనికి పెయిండు....

అయితే ఏడెనిమిదేళ్లనుంచి తన పల్లాకి మూలపడింది. ఎవ్వరడిగేటోల్లే లేరు... లగ్గాలకు సవారు బండ్లల్ల పోవుటానికి బదులు బస్సులల్ల పోతంద్రు... పల్లాకిలల్ల లగ్గం జేసుకుంటానికి బదులు కార్లు, జీపులల్ల సేసుకుంటద్రు... తన పని దెబ్బతింది.... అయితే తనిప్పుడు సాతగాకుంటయ్యాడు... పల్లాకిని మోసుడు తన కిప్పుడు కట్టమే.. అయినా తన పల్లాకికి గిరాకుంటే మంచి గుండేది. మునుపు ఊరికొక్క బస్సైనా ఉండేది కాదు. ఇప్పుడు తనూరికే రోజుకు మూడుసార్ల బస్సత్తంది. ఇగ తన పల్లాకి నెవ్వలు కోరుకుంటారు?...

బాలయ్య మొకంల విచారం...

☆ ☆ ☆

తన పని మూలపడినప్పట్నుంచి బీరపోయి, ఏదో పోగొట్టుకున్నోని తీరుగుండే బాలయ్యకీ గిరాకి దొరికినందుకు మస్తు సంతోషంగుంది. పొద్దంత దాన్ని తయారు చేసికుంటనే ఉన్నడు... పొద్దంగినంక పొయ్యి మల్లో బింకెండంత కల్లు తాగచ్చిండు. చాన్రోజుల తర్వాత తన పల్లాకిల జరుగబోయే సాలె శెంకరయ్య కొడుకు లగ్గం ఊరేగింపు గురించి మంచంల కూచొని ఆలోచిస్తండు బాలయ్య... సెవులకెల్లి మొక్కసుట్టదీసి చెకుముకిరాయి గొట్టి అంటు పెట్టిండు. సుట్టదాక్కుంట తన పల్లాకికి గిరాకిచ్చినందుకు సంబరపడ్తున్న బాలయ్య శెంకరయ్య అచ్చేది సూచి లేచి నిల్చున్నాడు.... సాలె శెంకరయ్య బాలయ్య దగ్గెరికచ్చి నిల్చున్నడు...

"వారి బాలయ్య...! గిప్పటికాలం మనకాలమార. ఇప్పటి పోరగాండ్లు పెద్దోల్లు సెప్పతే ఇనెటట్టున్నారా! ఏంజెయ్యాలెరా బాలయ్య....? ఎంత జెప్పినా ఇంటలేదు పోరడు. అడు పల్లాకిల లగ్గం జేసుకోడట... జీబన్న, కారన్న గావాల్నట.... ఏంజెయ్యాలా సెప్పు? అని పోరువడులేక జీపు మాట్లాడుమని మా తమ్మున్ని పట్నం దోలిచ్చిన... నువ్వు మూలకున్న పల్లాకిని తీసి మంచిగ చేసినట్టున్నవుగద...! నీకట్టం నేనుంచుకోను బిడ్డ... నీకు బయాన ఇరవై రూపాయలిచ్చిన గద... అండ్లకెల్లి పదుంచుకో... ఇంక పదిచ్చెయ్య... లేకుంటె ఇప్పుడియ్యకున్నా మంచిదే. అంతగనం పైసలెల్లకుంటే ఏమన్నా పన్జేత్తువు తియ్యి. నీ పల్లాకద్దు బిడ్డా లగ్గానికి. ఏమనుకోవద్దు" అని చెప్పి వెళ్ళిపెయిండు శెంకరయ్య.

ఇంతదాక కళకళలాడుతున్న బాలయ్య మొకం మాడిపెయింది. మనసు గాయపడ్డది. మొకంలో ఒక్క నెత్తురు చుక్క గూడ లేదు... పాలిపెయిన ముఖంతో తన పల్లాకి దిక్కు దీనంగా చూసుకుంట తలపట్టుకొని కూసున్నడు బాలయ్య.

చాకిరేవు నుంచొచ్చిన బూదమ్మ వాడిపోయున్న బాలయ్య మొకం జూసి "పోంగనేమె సంబురంగుంటివి... గిప్పుడు గిట్లున్నవేంది?" అంది బట్టల ముల్లె అకిట్లపడేసి. మొగని దగ్గర కచ్చి నిల్సోని.

కండ్లపొంటి నీల్లు పటపట గారుతుంటె శెంకరయ్యొచ్చి పెయిన సంగతి సెప్పిండు బాలయ్య బూదమ్మతోని... బాలయ్యను దగ్గెరకు తీసుకుంది బూదమ్మ.

"కాలం మారుతుంది. కాలంతోని మనంగుడ మారాలె... నీకు పల్లాకంటె బాగ ప్రేముంది నిచ్చమే. కని గాదాన్నిపుడు కానెటోల్లెవ్వలు...? అందుకోసం దానిమీదెంత ప్రేమున్నా ఇడిసి పెట్టాలె... గదే సేత్తనని పట్టుబడితే పొట్టెట్ల నిండాలె? ఓ ఇస్త్రీ పెట్టె కొనుక్కుంటే పొట్ట కెల్లుతది – నీకింత పనుంటది... నేను ఊరు ఉతుకుతనే వుంటి... అయిందానికి బాధడకు..." అన్కి పెనిమిటి నోదార్చింది.

బాలయ్య కండ్లపొంటి నీల్లు గారుతుంటె పెండ్లాం మాటలు విని తలుకాయూపిండు...

● ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 19–7–1990 ●

★ ★ ★